క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ కమలాకర్ తెలిపారు. పట్టణంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ నెలవారి మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విషయాన్ని గమనించి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

భారతీయ బౌద్ధ మహాసంఘం కమిటీ ఎన్నిక



నూతన కమిటీ

సిర్పూర్(టి): భారతీయ బౌద్ధమహా సంఘం సిర్పూర్(టి) మండల నూతన కమిటీని శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో భారతీయ బౌద్ధ మహాసంఘం తాలుకా కమిటీ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. భారతీయ బౌద్ధ మహాసభ సిర్పూర్(టి) మండల అధ్యక్షుడిగా నగ్రాడె రాజు, ఉపాధ్యక్షులుగా రాంటెంకి శంకర్, బెండారి శ్రీనివాస్, దుర్కె సాజన్, జాడి వనకర్, ప్రధాన కార్యదర్శిగా దుర్గం తిరుపతి, సంయుక్త కార్యదర్శులుగా దర్శన్ దస్రు, డోంగ్రె రమేష్, దుర్గం భారత్, ప్రచార కార్యదర్శులుగా కర్మాన్‌కర్ తుకారాం, రాంటెంకి సాయినాథ్, శాలిక్ తాడె, కోశాధికారిగా గోమాసె వాసుదేవ్, సలహాదారులుగా రాంటెంకి పత్రు, దుర్గం నాందేవ్, దుర్గం పుండలిక్, ఆత్మారాం, చునార్కర్ ఉమాజి, జాడి గంతిదాస్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు ప్రదానం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని 10వ వార్డు ఆదర్శనగర్ ఎంసీసీ క్రీడా మైదానంలో స్వర్గీయ వనమాల వెంకటస్వామి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌లో 10వ వార్డు యువత జట్టు విజయం సాధించింది. శుక్రవారం పలువురు నాయకులు పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గిరీష్ కుమార్, బీఆర్ఎస్ యూత్ నాయకులు కోనేరు ఫణి కుమార్, స్థానిక వార్డు కౌన్సిలర్ వనమాల విజయ రాము, మున్సిపల్ మాజీ చైర్మన్ దస్తగీర్ అహ్మద్, శివ, వలీ, మినాజ్, ఎల్లేష్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

25లోగా ఫీజు చెల్లించాలి

కాగజ్‌నగర్‌టౌన్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో అడ్మిషన్ తీసుకున్న రెగ్యులర్ డిగ్రీ విద్యార్థులు సెమిస్టర్- 1, 3, 5 పరీక్షల ఫీజును ఈ నెల 25లోగా ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని ఎస్‌కేఈ డిగ్రీ కళాశాల స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ తూడురు దత్తాత్రేయ తెలిపారు. పరీక్షలు ఫిబ్రవరిలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు 98663 98678 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఫిబ్రవరి 22 నుంచి డీఈడీ పరీక్షలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో ఫిబ్రవరి 22 నుంచి డీఈడీ ఫస్టియర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈవో అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 22 నుంచి 28 వరకు ఈ పరీక్షలు కొనసాగుతాయని ఆయన

జెడ్పీ పాఠశాలకు స్థలం కేటాయించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని జన్కాపూర్‌లో గల జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలకు స్థలం కేటాయించాలని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో ఏవో రఫతుల్లాకు వినతిపత్రం అందించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ పాఠశాలలో దాదాపు 400 మంది విద్యార్థులు ఉన్నా అందుకనుగుణంగా తరగతి గదులు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారన్నారు. అలాగే తాగునీరు, మూత్రశాలలు సైతం అందుబాటులో లేవన్నారు. పాఠశాలను అనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చిరంజీవి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దినకర్, నాయకులు అంబాల రవి, కార్తీక్, తిరుపతి తదితరులు ఉన్నారు.

27న అంగన్‌వాడీల సమస్యలపై ధర్నా

బెల్లంపల్లి: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27న ఐసీడీఎస్ ప్రాజెక్టు ఎదుట ధర్నా చేయనున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి రంజిత్‌కుమార్ తెలిపారు. బెల్లంపల్లి సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం ధర్నా కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బానుమతి, నాయకులు శంకరమ్మ, అనురాధ, మహేశ్వరి, సరిత, సత్యవతి, పద్మావతి, ఉమాదేవి, అరవింద, విజయ, సువర్ణ పాల్గొన్నారు.

కోరిన కోర్కెలు తీర్చే నాగోబా!

- నేటి నుంచి పెద్ద కరంజివాడలో ఉత్సవం
- జిల్లాతో పాటు మహారాష్ట్ర భక్తుల రాక

కెరమెరి: కోరిన కోర్కెలు తీర్చే దేవత నాగోబాకు ఘనంగా పూజలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. నాగోబాను మనసు పెట్టి పూజిస్తే సకల కార్యాలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. ఇప్పటికే ఆనేక గ్రామాల నుంచి భక్తులు రాక ప్రారంభమైంది. మండలంలోని కరంజివాడ గ్రామ పంచాయతీ పెద్ద కరంజివాడ గ్రామంలో నాగోబాకు నేడు ప్రత్యేక పూజలు చేయనున్నారు. 27 ఏళ్ల నుంచి కొనసాగుతున్న ఉత్సవానికి భక్తుల సంఖ్య భారీగా పెరుగుతోంది. గ్రామ పటేల్, పూజారి కుంరం బొజ్జు ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగనున్నాయి.

ఇది చరిత్ర!

పెద్దలు చెప్పిన చరిత్ర ప్రకారం.. 1995 సంవత్సరంలో పెద్ద కరంజివాడలో కుంరం బొజ్జు ఇంటి వరండాలో కూర్చొని మహిళలు పనులు చేస్తుండగా అకస్మాత్తుగా నాగుపాము ప్రత్యక్షమైంది. అయితే గ్రామ యువకులు కర్రలతో దాన్ని కొట్టి చంపారు. అదే రాత్రి కొట్టంలో ఉన్న 40 మేకలు హఠాత్తుగా మరణించడంతోపాటు గేదెలు, ఆవులు కూడా అనారోగ్యం బారిన పడ్డాయి. దీంతో గ్రామ పటేల్ బొజ్జు పశువులను ఆరోగ్యవంతులుగా చేస్తే ఇంట్లోనే పుట్ట నిర్మించి ప్రతీ సంవత్సరం మొక్కులు తీర్చుకుంటామని, తప్పు జరిగితే క్షమించమని వేడుకున్నాడు. తెల్లారే సరికి పశువులన్నీ ఆరోగ్యంగా మారడంతో ఇది దేవుని మహిమ అని తెలుసుకున్న బొజ్జు తన ఇంట్లోనే పాము పుట్టను తయారు చేసి పూజలు చేస్తున్నట్లుగా స్థానికులు చెబుతున్నారు.

సకల కార్యాలు సిద్ధిస్తాయని..

మనసు లగ్నం చేసి నాగోబాను పూజిస్తే సకల కార్యాలు సిద్ధిస్తాయని భక్తుల విశ్వాసం. సంతానం లేని వారికి సంతానం కలుగుతుందని, ఆపదలో ఉన్న వారి కష్టాలు దూరమవుతాయని, దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమవుతాయని భక్తుల భావన. అందుకే జిల్లాతో పాటు మహారాష్ట్రలోని భక్తులు ఇక్కడికి పెద్ద ఎత్తున తరలివస్తున్నారు.



దేవాలయంలో నాగోబా



దేవుళ్ల ప్రతిమలు

గంగ నీటి కోసం పాదయాత్ర

నేటి నుంచి మండలంలోని పెద్ద కరంజివాడలో ప్రారంభమయ్యే నాగదేవత పూజకు పవిత్రమైన గంగ జలాన్ని భక్తులు శుక్రవారం తీసుకొచ్చారు. వివిధ గ్రామాలకు చెందిన మహిళలు పాదయాత్ర చేసి జలం తీసుకొచ్చారు. సాయంకాలం పవిత్రమైన ప్రదేశం నుంచి తీసుకొచ్చిన మట్టితో నాగరాజు పాము పుట్టను తయారు చేశారు. నేడు పాముపుట్టల వద్ద పాలు పోసి, సంప్రదాయబద్ధంగా మొక్కులు తీర్చుకోనున్నారు.



గంగ జలం తీసుకొస్తున్న భక్తులు

ఆపన్న హస్తం అందించరూ..!

- షుగర్ వ్యాధితో మంచానికే పరిమితం
- కులవృత్తే జీవనాధారం
- ఆర్థిక స్థోమత లేక వైద్యానికి దూరం

బెజ్జూర్: మండలంలోని చిన్న సిద్దాపూర్ గ్రామానికి చెందిన బూస లక్ష్మి అనారోగ్యంతో మంచానికే పరిమితమై దాతల సాయం కోసం ఎదురుచూస్తోంది. రజక వృత్తి చేస్తూ జీవనం సాగిస్తున్న లక్ష్మిది రెక్కాడితే కాని డొక్కాడని పరిస్థితి. కాని ఆమెకు పెద్ద కష్టమొచ్చి పడింది. ప్రస్తుతం షుగర్ వ్యాధితో బాధపడుతోంది. కాలికి చిన్న గాయం కాగా, అది కాస్త ఇన్ఫెక్షన్‌గా మారి కాలు పూర్తిగా చెడిపోయే స్థితికి చేరుకుంది. వైద్యం చేయించే ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఇంట్లో మంచానికి పరిమితమైంది. వైద్యం కోసం దాతల సాయం కోరుతోంది. ఆర్థిక సాయం అందించే దాతలు 6300005645, 6304817438 నంబర్లపై ఫోన్‌పే, గూగుల్‌పే చేయాలని కోరుతోంది.



మంచానికే పరిమితమైన బూస లక్ష్మి

చిరుధాన్యాల సాగుతో అధిక రాబడి

తిర్యాణి: రైతులు చిరుధాన్యాల సాగు చేయడం ద్వారా అధిక రాబడి సాధించవచ్చని మండల వ్యవసాయశాఖ అధికారి తిరుమలేశ్వర్ అన్నారు. శుక్రవారం మండలంలోని గుండాల గ్రామంలో చిరుధాన్యాల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు పంటల సాగులో మెలకువలు పాటించాలని సూచించారు. సర్పంచ్ జంగుబాయి, మాజీ ఎంపీటీసీ మోతిరాం ఉన్నారు.

చిరుధాన్యాల సాగు ఎంతో మేలు

కాగజ్‌నగర్‌రూరల్: చిరుధాన్యాల సాగు ఎంతో మేలు చేస్తుందని ఏడీఏ మనోహర్ అన్నారు. శుక్రవారం మండలంలోని బోడపల్లి గ్రామంలో అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాలు పండించి తినడం వల్ల అనేక ఉపయోగాలున్నాయని, అధిక బరువు, రక్తహీనత, షుగర్ వ్యాధిగ్రస్తులు చిరుధాన్యాలు తీసుకోవడం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి రామకృష్ణ, ఏఈవో యువరాణి, నాయకులు రాజన్న, శ్యాంరావు పాల్గొన్నారు.



సాగుపై అవగాహన కల్పిస్తున్న ఏవో

జంతు సంక్షేమం అందరి బాధ్యత

- కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆసిఫాబాద్: జంతు సంక్షేమాన్ని ప్రజలు బాధ్యతగా భావించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. జంతు సంక్షేమానికి ప్రజలు తీసుకోవాల్సిన చర్యలను సూచిస్తూ జంతు హింస నివారణ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను శుక్రవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్లు చాహత్‌బాజ్‌పాయి, రాజేశంతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జంతువుల సంక్షేమం కోసం ప్రతీ ఒక్కరు పాటుపడాలన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సురేశ్, ఏఎస్పీ భీమ్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు..

జిల్లా కేంద్రంలో ఈనెల 26న నిర్వహించనున్న గణతంత్ర వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయ్, రాజేశం, ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వేడుకలకు హాజరయ్యే వారికి అన్ని వసతులు కల్పించాలన్నారు. ప్రభుత్వ శాఖల నుంచి విధి నిర్వహణలో ప్రతిభ చాటిన ఉద్యోగులను ఎంపిక చేసి జాబితా పంపించాలని ఆదేశించారు. ఆయా శాఖల్లో పురోగతిని తెలియజేస్తూ అధికారులు ప్రగతి నివేదిక సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ భీమ్‌రావు, డీఆర్వో రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఇంటి పన్ను వసూళ్లపై నజర్

- లక్ష్యం రూ. 1,08,13,998
- నేటి వరకు వసూలు రూ. 49,68,115
- మార్చిలోపు వందశాతం చేయడమే టార్గెట్

ఆసిఫాబాద్‌రూరల్: గ్రామాల అభివృద్ధికి పన్నులే ప్రధాన ఆదాయ వనరులు కాగా మార్చిలోపు వందశాతం పన్నులు వసూలు చేసేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. పంచాయతీ సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇంటింటికీ తిరుగుతూ ఇంటి పన్నులు వసూలు చేస్తున్నారు. మండలంలోని 27 గ్రామ పంచాయతీల పరిధిలో 2022 -23 సంవత్సరానికి నిర్దేశించిన ఇంటి పన్నుల లక్ష్యాన్ని అధిగమించేందుకు గ్రామస్థాయి అధికారులు ఇంటి పన్నులు వసూలు చేస్తున్నారు. గతంలో 14 గ్రామ పంచాయతీలే ఉండగా పునర్విభజనలో 27 గ్రామ పంచాయతీలు ఏర్పడ్డాయి. మండల వ్యాప్తంగా మొత్తం రూ. 1,08,13,998 వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ. 49,68,115 వసూలు చేశామని మిగిలిన రూ. 58,45,883 చేయాల్సి ఉంది. మార్చి వరకు గడువు ఉండగా ఫిబ్రవరి చివరిలోగా 100శాతం పూర్తి చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

వేగంగా వసూళ్లు..

డిసెంబర్ నుంచి పన్నుల వసూలుకు మండల వ్యాప్తంగా అధికారులు శ్రీకారం చుట్టారు. ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఉదయాన్నే గ్రామాలకు చేరుకొని ఇంటింటికి తిరుగుతూ యజమానులు పన్నులు చెల్లించేలా అవగాహన కల్పిస్తున్నారు. డీఎల్‌పీవో, ఎంపీవో ఆకస్మిక తనిఖీలు చేపట్టడంతో పాటు సమీక్ష సమావేశాల్లో వంద శాతం పన్నులు వసూలయ్యేలా చర్యలు చేపట్టారు. సంబంధిత అధికారులు మార్చిలోపు వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించడంతో పంచా యతీ కార్యదర్శులు ఉదయం వేళల్లో తమ పరి ధిలోని గ్రామాల్లో తిరుగుతూ పన్నులు వసూలు చేస్తున్నారు.

8 పంచాయతీల్లో 100 శాతం..

మండలంలోని 27 గ్రామ పంచాయతీలకు ఇప్పటివరకు ఆరు గ్రామ పంచాయతీల్లో 80శాతం ఇంటి పన్నులు వసూలు చేశారు. ఆసిఫాబాద్ మినహాయించి 26 గ్రామ పంచాయతీల్లో రూ. 24,20,410 లక్ష్యానికి రూ.13,72,581తో 60శాతం పూర్తి కాగా రూ.10,47,829 వసూలు చేయాల్సి ఉంది. ఇందులో మోతుగూడలో 90శాతం పూర్తి కాగా మోవాడ్, ఆడదస్నాపూర్, అప్పపల్లి, గుండి, రౌటసంకెపల్లి, చిలాటిగూడ, కొటాగూడ గ్రామ పంచాయతీల్లో 60శాతం పూర్తి చేశారు. బాబాపూర్, బూర్గుడ, చోర్‌పెల్లి, ఈదులవాడ, రహపల్లి, సాలేగూడ, ఎల్లారంతో పాటు15 గ్రామ పంచాయతీల్లో ఇప్పటివరకు 50శాతం వరకు పన్నులు వసూలు చేశారు. మార్చిలోగా అన్ని గ్రామ పంచాయతీల్లో వంద శాతం పన్నుల వసూలు పూర్తి చేయాలనే లక్ష్యంతో అధికారులు ఉన్నారు.



మోతుగూడ జీపీలో ఇంటి పన్ను వసూలు చేస్తున్న అధికారి

మార్చి చివరి నాటికి పూర్తి చేస్తాం

ఇప్పటి వరకు ఆసిఫాబాద్ మినహాయించి మిగతా అన్ని గ్రామ పంచాయతీల్లో 50 నుంచి 70 శాతం వరకు పన్నులు వసూలయ్యాయి. మూడు గ్రామ పంచాయతీల్లో 100 శాతం పూర్తి చేశాం. మిగతా జీపీల్లో ఫిబ్రవరి చివరి నాటికి వందశాతం పన్నుల వసూలు చేస్తాం.

- ప్రసాద్, ఎంపీవో

పవిత్ర స్నానానికి బయలుదేరిన 'జంగుబాయి'

కెరమెరి: మండలంలోని గోండ్‌గూడ(ఇందాపూర్) గ్రామానికి చెందిన ఆదివాసీలు రాయితాడ్ జంగుబాయిని తీసుకుని శుక్రవారం మండలంలోని సుర్దాపూర్ సమీపంలో ఉన్న ఆరేపల్లికి పాదయాత్రగా బయల్దేరారు. తిరిగి శనివారం తిరుగుపయనమై పూజలు నిర్వహిస్తామని పెద్దలు, కటోడాలు తెలిపారు. కార్యక్రమంలో కోట్నాక్ సోము, భీము, జంగు, దేవ్‌రావు, లాల్‌శావ్, బొజ్జిరావు తదితరులు పాల్గొన్నారు.



దేవతలకు పూజలు చేస్తున్న కటోడా

హరితహారం నర్సరీలను పరిశీలించిన డీపీవో

వాంకిడి: మండలంలోని గొయెగాం, నవేగూడ గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన హరితహారం నర్సరీలను జిల్లా పంచాయతీ అధికారి రమేష్ శుక్రవారం పరిశీలించారు. గ్రామాల్లో శానిటేషన్, హరితహారం పనులు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీవో శివకుమార్, పంచాయతీ కార్యదర్శులు శ్వేత, సౌమ్య తదితరులు ఉన్నారు.



సెగ్రిగేషన్ షెడ్ పరిశీలిస్తున్న డీపీవో రమేష్

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

కౌటాల: గ్రామీణ విద్యార్థులు క్రీడల్లో రాణించాలని మయూరి విద్యాలయం కరస్పాండెంట్ యాదగిరి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మయూరి ప్రైవేట్ విద్యాలయంలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని తెలిపారు. విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో ఆటలు ఆడాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు

'కుల ధ్రువీకరణ పత్రం, భూమి పట్టా రద్దు'

ఆసిఫాబాద్: ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ అక్రమంగా పొందిన కుల ధ్రువీకరణ పత్రాలు, భూమి పట్టాలను రద్దు చేసినట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. కాగజ్‌నగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మహమ్మద్ అష్రఫ్ కుమారుడు మహమ్మద్ అలీ అక్బర్, కుమార్తె ఇక్రా ఫాతిమలకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు పొందారని అన్నారు. దీనిపై జిల్లాస్థాయి పరిశీలన కమిటీ (డీఎల్ఎస్‌సీ) సిఫార్సుల దృష్ట్యా విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. జిల్లా స్థాయి స్క్రూటినీ కమిటీ చేసిన తప్పుడు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాన్ని రద్దు చేయాలనే ఆదేశాలను అమలు చేశామని వెల్లడించారు. అలాగే మహమ్మద్ అష్రఫ్ భార్య అరుణకుమారి అలియాస్ అయేషా సిద్ధికి కాగజ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయ పరిధిలో కులాంతర వివాహం చేసుకున్నానని, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నానని పేర్కొంటూ బోరిగాం శివారులో సర్వే నం .191లోని 4 ఎకరాల భూమిని పొందారని తెలిపారు.

దీనిపై జిల్లా స్థాయి కమిటీ ఆధ్వర్యంలో విచారణ చేపట్టగా, తప్పుడు ధ్రువపత్రాలతో అక్రమంగా భూమి పొందినట్లు తేలిందన్నారు. ఈ క్రమంలో కుల ధ్రువీకరణ పత్రాలతోపాటు అక్రమంగా పొందిన భూమి పట్టాను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం పరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గజ్జల లక్ష్మణ్ అభ్యర్థిత్వానికి ఏకగ్రీవ తీర్మానం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని భట్‌పల్లి చౌరస్తాలో గల మున్నూరు కాపు సంఘ భవనంలో శుక్రవారం తాలూకా మున్నూరుకాపు సంఘం కార్యవర్గ సమావేశాన్ని తాలూకా అధ్యక్షుడు కలికోట రమణయ్య అధ్యక్షతన నిర్వహించారు. త్వరలో జరగబోయే కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్ష పదవికి తాలూకా నుంచి ఎవరిని ఎన్నుకోవాలనే అంశంపై అభిప్రాయాలు సేకరించారు. మెజార్టీ సభ్యుల తీర్మానం మేరకు ఆర్ఎంపీ వైద్యులు గజ్జల లక్ష్మణ్‌ను జిల్లా అధ్యక్ష పదవికి ఎన్నుకోవాలని తీర్మానించారు. సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు ఇందూరి వెంకటేశం, వల్లాల యాదగిరి, కోశాధికారి దెబ్బడి జలపతి, ఆఫీస్ సెక్రటరీ యాస సత్యనారాయణ, కుల పెద్దలు గజ్జి వాసుదేవ్, లింగం రామయ్య, ఉండవెల్లి సర్పంచ్ మెకార్తి గంగన్న, చింతగూడ గ్రామ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు గోవిందుల రాజన్న తదితరులు పాల్గొన్నారు.

సురోజి చూపిన మార్గం ఆదర్శనీయం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఆత్రం సక్కు

కెరమెరి: శ్రీ సంత్ సురోజి మహరాజ్ చూపించిన మార్గం ఆదర్శనీయమని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. శుక్రవారం సిర్పూర్(యూ) మండలంలోని మహగాంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సురోజి మహరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసీలు ఆధ్యాత్మికతతో పాటు విద్య, వ్యవసాయ రంగాల్లో పురోగతి సాధించాలని పేర్కొన్నారు. గోండి ధర్మపరిరక్షణకు పాటుపడాలని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, సింగిల్ విండో చైర్మన్ శివాజి, వైస్ ఎంపీపీ ఆత్రం ప్రకాశ్, సర్పంచ్ ఆత్రం పద్మ, పీఠాధిపది మెస్రం కైలాస్, తదితరులు ఉన్నారు.

వీయూపీ బ్రిడ్జి ప్రాంతం పరిశీలన

వాంకిడి(ఆసిఫాబాద్): వాంకిడి మండల కేంద్రంలో వివాదాస్పదంగా మారిన వీయూపీ(వెహికిల్ అండర్‌పాస్) బ్రిడ్జి ప్రాంతాన్ని శుక్రవారం ఆర్డీవో జాడి రాజేశ్వర్ ఎన్‌హెచ్ అధికారులతో కలిసి పరిశీలించారు. నేషనల్ హైవే అథారిటీ ప్రణాళిక ప్రకారం నిర్మాణ పనులు సాగుతున్నాయన్నారు. ఇదే ప్రాంతంలో బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ రహీముద్దీన్ ఎన్‌హెచ్ఏఐ అధికారులు తదితరులు ఉన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో రాజేశ్వర్